పోచారం ప్రాజెక్టు వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం

- కుటుంబకలహాలతో పురుగుల మందు తాగిన వైనం
- కాపాడిన కోర్టు కానిస్టేబుల్ దక్షిణమూర్తి

ఆత్మహత్యాయత్నం చేసిన కిరణ్

నాగిరెడ్డిపేట, మార్చి9: పోచారం ప్రాజెక్టు వద్ద కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువకుడిని కోర్టు కానిస్టేబుల్ దక్షిణమూర్తి గుర్తించి 108 అంబులెన్సులో దవాఖానకు తరలించి ప్రాణాలు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పుత్తలూరి కిరణ్ తండ్రి మానయ్య. కిరణ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబకలహాలతో జీవితంపై విరక్తి చెంది కిరణ్ ఆదివారం పోచారం ప్రాజెక్టు సమీపంలోని గోల్‌బంగ్లా వద్ద పురుగుల మందు తాగాడు. ఇంటికి ఫోన్ చేసి తాను పోచారం ప్రాజెక్టు వద్ద పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. తాను చనిపోతున్నానని, తన గురించి వెతక వద్దని ఫోన్ పెట్టేశాడు. దీంతో గతంలో ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న సమయంలో కిరణ్ ఇంటి పక్కన నివాసం ఉన్న కానిస్టేబుల్ దక్షణ మూర్తికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన పోచారం గ్రామానికి చెందిన మ్యాకల శ్రావణ్‌కుమార్‌కు ఫోన్ చేసి ప్రాజెక్టు సమీపంలో చూడాలని తెలిపి ఆయన నేరుగా వెళ్లి ప్రాజెక్టుకు రెండు వైపులా వెతికాడు. సమాచారం దొరక్కపోవడంతో మెదక్ వైపు ఉన్న గోల్‌బంగ్లా వద్దకు వెళ్లి వెతకగా.. కిరణ్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 108కు సమాచారం అందించి, ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సత్వరం స్పందించి కష్టపడి కిరణ్ ప్రాణాలను కాపాడిన దక్షణమూర్తిని స్థానికులు అభినందించారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు సన్మానం

క్రీడాకారులను సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ తదితరులు

బీబీపేట్(దోమకొండ), మార్చి 9: దోమకొండలోని గడీకోటలో ఆర్చరీ విద్య నేర్చుకున్న నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వారిని మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ పలువురు నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ మాట్లాడుతూ.. కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 2వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి మినీ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపిన బి.ఇందు, వర్షిణి, డి.అకుల్, రమ్మ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వారు ఈనెల 22నుంచి 28వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కామినేని అనిల్, జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్, కార్యదర్శి మోహన్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, మండల అధికారులు, నాయకులు అభినందించారు.

కారు, ట్రాక్టర్ ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు

రుద్రూర్, మార్చి 9 : రుద్రూర్ గ్రామశివారులోని బోధన్ – రుద్రూర్ ప్రధాన రహదారిపై కారు – ట్రాక్టర్ ఆదివారం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులు బొప్పాపూర్ గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

బైక్ ఢీకొని వాచ్‌మన్ దుర్మరణం

వినాయక్‌నగర్, మార్చి 9 : నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు షోరూంలో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి.. బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మరో ఢీకొట్టడంతో మృతిచెందాడు. నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉండే పాలకొండ సత్యనారాయణ(62) స్థానికంగా ఉన్న ఓ ద్విచక్రవాహనాల షోరూంలో వాచ్‌మన్‌గా పనిచేసేవాడు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగిసిన తర్వాత బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా పల్సర్‌బైక్‌పై వచ్చిన వ్యక్తి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన సత్యనారాయణను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా... చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ దరఖాస్తులకు గడువు పెంపు

ధర్పల్లి, మార్చి 9 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును పొడిగించామని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6తరగతిలో మొత్తం సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఓసీలకు రూ. 200, మిగతా వారికి రూ. 125 రుసుము ఉంటుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గంజాయి పట్టివేత

వినాయక్‌నగర్, మార్చి 9 : జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో గంజాయిని తరలిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామానికి చెందిన బీస ప్రవీణ్ బ్యాగులో గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి, బస్టాండ్ వద్ద తనిఖీ చేసినట్లు తెలిపారు. అతడి బ్యాగులో 250 గ్రాముల గంజాయి లభించినట్లు వెల్లడించారు. సదరు యువకుడిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషిచేసిన ఎస్సై మొగులయ్య, సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

మోర్తాడ్, మార్చి 9: యాసంగి పంటలకు డిసెంబర్ 25 నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వివిధ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో రోజురోజుకూ ప్రాజెక్ట్‌లో నీటిమట్టం తగ్గుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా ఆదివారం ప్రాజెక్ట్‌లో 1073 అడుగులు (28.693 టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 3500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250, అలీసాగర్ ఎత్తిపోతలకు 360, గుత్ప ఎత్తిపోతలకు 135 , సరస్వతీ కాలువకు 700, మిషన్ భగీరథకు 231 క్యూసెకుకల నీటిని విడుదల చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని చితకబాదిన వార్డెన్

నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఘటన

చేతిపై వాతను చూపుతున్న విద్యార్థి

వినాయక్‌నగర్, మార్చి 9 : నిజామాబాద్ రూరల్ పరిధిలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో విద్యార్థిని వార్డెన్ వాతలు పడేలా కొట్టిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గంగస్థాన్ ఏరియాలో ఉన్న ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో నిర్మల్ జిల్లాకు చెందిన ఓ బాలుడు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ పరీక్షలు జరుగుతుండడంతో కళాశాల హాస్టల్ గదిలో ఉన్న సదరు విద్యార్థి సాయంత్రం పడుకొని ఉన్నాడు. అదే సమయంలో వచ్చిన హాస్టల్ ఇన్‌చార్జి సదరు విద్యార్థిని కొట్టాడు. విద్యార్థి ఎడమ చేయి భుజం కింద వాతలు పడ్డాయి. ఈ విషయం సదరు విద్యార్థి తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలిపాడు. విద్యార్థి కుటుంబీకులు హాస్టల్‌కు వచ్చి, కళాశాల బాధ్యులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని వార్డెన్ కొట్టిన ఘటనపై రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్‌ను వివరణ కోరగా.. విద్యార్థి, అతడి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విషయాన్ని వివరించారని, కానీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

కుమారుడి వ్యాపారంలో నష్టాలు రావడంతో తల్లి ఆత్మహత్య

వినాయక్‌నగర్, మార్చి 9 : తన కుమారుడు చేసిన పూల వ్యాపారంలో నష్టపోయి, అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపం చెందిన తల్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్ నగరంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కోటగల్లీకి చెందిన మెరిగె కవిత (43) కుమారుడు మనోజ్ కొంతకాలం క్రితం పూల వ్యాపారం నిర్వహించగా నష్టం రావడంతో మనస్తాపానికి గురైంది. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కవిత కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.